


సిరిసిల్లలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, భానుప్రసాదరావు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడికౌశిక్‌రెడ్డి, పార్టీనేతలు రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్, నారదాసు, సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు

# ఎడారిగా మారిన సజీవ జలధారలు

## కరీంనగర్ చుట్టూ నాలుగు జలధారలు సృష్టించినం

ఇప్పుడవన్నీ ఎండిపోయి ఎడారులుగా మారినయి • 2014కు ముందున్న గోస మళ్లా పునరావృతం
ప్రభుత్వ అసమర్థతతో 20 లక్షల ఎకరాల్లో నష్టం • చనిపోయిన 209 మంది రైతుల జాబితా ఇచ్చినం
ఆ కుటుంబాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలి • ఇది ప్రకృతి విపత్తు కన్నా పెద్దది..
ఎకరాకు 25 వేల పరిహారం ఇవ్వాలి • కేఆర్ఎంబీకి మనమీద పెత్తనం ఎట్లుంటది?
రాష్ట్రానికి ముఖ్యమంత్రివి నువ్వా? నేనా? • సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగు సజీవ జలధారలను సృష్టిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల అవి ఎండిపోయి ఎడారులుగా మారాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా కరెంటు కోతలు, ఎండిపోయిన పంటలు, కాలిపోయిన మోటర్లు, బిందెల కొట్లాటలు.. ఒక్క ముక్కలో చెప్పాలంటే 2014కు ముందు పరిస్థితులు పునరావృతం అయ్యాయని చెప్పారు. ఎండిన పంటల పరిశీలనకు కేసీఆర్ శుక్రవారం కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నీటి నిర్వహణలో ప్రభుత్వ అసమర్థతను ఎండగట్టారు. 'నీళ్లు వదలాలని ముందే చెప్పొచ్చుకదా..' అన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రివి నువ్వా..? నేనా..? అని ప్రశ్నించారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

### కరీంనగర్ చుట్టూ నాలుగు జలధారలు

నేను, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి, నాటి గవర్నర్ నరసింహన్ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించిన తర్వాత కరీంనగర్‌కు వచ్చి మీడియా సమావేశం నిర్వహించాను. 'కాళేశ్వరం పూర్తయింది కాబట్టి కరీంనగర్ జిల్లాకు ఇక ఢోకా ఉండదు. ఉమ్మడి జిల్లాలో నాలుగు సజీవ జలధారలు ఉంటయి. అవి నిరంతరం ఈ జిల్లాను కాపాడుతయి' అని చెప్పిన. ఆ సజీవ జలధారలను మేమే సృష్టించినం. యావత్ జిల్లా ప్రజలు వాటిని కండ్లారా చూశారు, వాటి ఫలితాన్ని అనుభవించారు.

1) **మానేరు వాగు:** అప్పర్ మానేరు జలాశయం దగ్గర మొదలై అన్నారం బరాజ్ దగ్గర గోదావరిలో కలిసేవరకు చెక్‌డ్యామ్‌లు, ఇంటర్మీడియన్ డ్యామ్‌లు నిరంతరం కాళేశ్వరం నీళ్లతో కళకళలాడుతూ ఉంటాయని చెప్పిన.
2) **వరద కాలువ:** దశాబ్దాల తరబడి పెండింగ్ ఉన్న వరద కాలువను పూర్తి చేయడమే కాకుండా.. శ్రీరాంసాగర్ పునర్జీవ పథకం పేరుతో వరద కాలువను రిజర్వాయర్‌గా మార్చినం. సంవత్సరం పొడవునా 1.50 టీఎంసీల నీళ్లు ఉండేటట్టు చేసినం.
3) **కాకతీయ కాలువ :** సంవత్సరంలో దాదాపు 10 నెలలు నిండు గర్భిణిలా ప్రవహించే కాలువ.
4) **200 కిలోమీటర్ల సజీవ నది:** గోదావరి మీద నిర్మించిన బరాజ్‌లు, అసంపూర్తిగా ఉన్న ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు పూర్తిచేయడం, ఎస్సారెస్పీ పునర్జీవం వంటివాటి ద్వారా గోదావరి నది 200 కిలోమీటర్ల పొడవున నిండు జలాలతో మారిన సజీవ అమృత ధార.

ఈ నాలుగు ధారలు ఏ విధంగా నిండి ఉండెనో.. ఐదారేండ్లుగా వాటి ఫలితాలను ఏవిధంగా అనుభవించారో యావత్ ప్రజానీకానికి తెలుసు. ఇన్ని జలధారలు సృష్టించబడి, చక్కని ఫలితాలు లభించి, లక్షల టన్నుల ధాన్యం పండించి, పుష్కలంగా మంచినీరు అనుభవించిన కరీంనగర్ జిల్లా ప్రజలు.. నాలుగైదు నెలల్లోనే ఏం జరుగుతున్నదో చూస్తున్నరు. అవన్నీ ఎడారులుగా మారిపోయినయి. ఒకప్పుడు మిడ్ మానేరు బ్రిడ్జీ మీద నిలుచుంటే సముద్రం మధ్యలో నిలబడినట్టు అనిపించేది.



సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీడువారిన పొలం ఫొటోను చూపిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

> ఇయ్యాల తెలంగాణలో పంటలు ఎండని జిల్లా లేదు, కరెంటు మోటర్లు కాలని జిల్లా లేదు. పాత తెలంగాణ మల్లా పునరావృతం అయ్యింది. ఇందిరమ్మ రాజ్యంలో ఇగిలిచ్చినట్టు ఉన్నది ప్రజల పరిస్థితి. నీటి నిర్వహణ సామర్థ్యం తెలియని లత్కోర్లు రాజ్యమేలుతున్నరు కాబట్టి.. అసమర్థులు, చవట దద్దమ్మలు రాజ్యంలో ఉన్నరు కాబట్టి ఇయ్యాల ఈ పరిస్థితి సంభవించింది. -కేసీఆర్

ఇప్పుడు పూర్తిగా ఎండిపోయింది. మునిగిపోయిన ఊర్లు, చెట్లు తేలినయి. ఒక శ్మశానం మాదిరిగా, ఎడారిలా తయారుచేశారు. లోయర్ మానేరు డ్యామ్‌లో మే నెల తర్వాత కూడా సగం నీళ్లు నిండి ఉంటుండే. కరీంనగర్, సిద్దిపేట వంటి అనేక పట్టణాలకు రోజూ కావాల్సినన్ని నీళ్లు ఇచ్చింది. నేను ఈరోజు మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఇంట్లో భోజనానికి వెళ్తే.. అక్కడ కరీంనగర్ మేయర్, కార్పొరేటర్లు, ప్రజలు మాట్లాడినరు. 'గతంలో రోజూ నీళ్లు వచ్చేవి, ఇప్పుడు రోజు తప్పి రోజు వస్తున్నయి, ఇంకొన్ని రోజులైతే మూడునాలుగు రోజులు అంటున్నరు.. భయమైతున్నది' అని అన్నారు.

### పదేండ్ల కిందటి గోస పునరావృతం

ప్రభుత్వ తెలివి తక్కువ, అసమర్థ, అవివేక, చవట విధానాల వల్ల, అర్భకత్వం వల్ల రాష్ట్రానికి ఈ దరిద్రం వచ్చింది. ఒక్కటే మాటలో చెప్పాలంటే.. 2014కు ముందు తెలంగాణలో ఏ గోస, ఏ ఏడుపు, ఏ బాధ, ఏ మంచినీళ్ల ట్యాంకర్లు, ఏ బిందెల కొట్లాటలు, ఏ కాలిపోయిన మోటర్లు, వేలాదిగా, లక్షలాదిగా మోటర్ల రిపేర్లు కనబడిందో.. ఇప్పుడు మల్లా అదే సీన్ పునరావృతం అయ్యింది. ఈ ప్రభుత్వం అనేక అడ్డగోలు హామీలు ఇచ్చి.. టెంప్ట్ చేసి మంచిగున్నవాళ్ల నోట్లె మట్టిగొట్టింది. అన్నీ మోసాలే. ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మళ్లా సిగ్గులేకుండా ఇయ్యాల మరో నాలుగైదు హామీలు ఇచ్చారు. అవి ఎవరిని ఉద్ధరించడానికో అర్థం కాదు.

### 20 లక్షల ఎకరాల్లో పంట ఎండింది

వెదిరె, గంగాధరల వంటిచోట్ల నా పర్యటన లేని గ్రామాల్లో కూడా రైతులు అడ్డం వచ్చి ఎండిపోయిన వరిని తీసుకొచ్చి నా చేతికి ఇచ్చి మా ఊర్లో 600 ఎకరాలు పోయింది.. మా ఊర్లో 800 ఎకరాలు పోయింది అని చెప్తున్నరు. మీదికి పొలం పచ్చగ కనిపిస్తున్నది గానీ కింద పర్రెలు పెట్టింది అని పొలం లోపలి దాకా తీసుకపోయి చూపించినరు. ప్రతి దగ్గర ఇదే పరిస్థితి. కరీంనగర్, మెదక్, గోదావరి బేసిన్‌లో ఉన్న జిల్లాల్లో ఈ పరిస్థితి ఎందుకు రావాలి?. ఇది కాలం తెచ్చిన కరువా.. మనుషులు తెచ్చిన కరువా.. కాంగ్రెస్ తెచ్చిన కరువా? ఈ కరువుకు కారణం ఎవరు? ఎవరి అసమర్థత.. ఎవరి తెలివి తక్కువతనం? కిరికిరి మాటలు, అడ్డగోలు మాటలు, తొండి మాటలతో ఇతరుల మీద ఆరోపణలు చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. కానీ తప్పించుకోలేరు. రాళ్లవాన అని ప్రభుత్వం అంటున్నది. కానీ దానిద్వారా దెబ్బతిన్నది లక్షన్నర ఎకరాలు మాత్రమే. రాష్ట్ర వ్యాప్తంగా 15-20 లక్షల ఎకరాల మధ్య పంటలు ఎండిపోయినయి. దీనికి రెండు విధాలుగా ప్రభుత్వమే కారణం. నీటి నిర్వహణ సామర్థ్యం లేక, దాన్ని ఎట్లా వాడాల్నో తెలవకపోవడం మొదటి కారణం. పాత బోర్లు ఉన్నయి కాబట్టి కరెంటుతోనన్న పారించి పంటలు దక్కించుకుందామంటే.. కరెంటు నాణ్యతగా రాక, మోటర్లు కాలిపోవడం రెండో కారణం. వెరసి ప్రభుత్వ వైఫల్యం వల్లే పంటలు ఎండినయి. కొంతమంది అసమర్థులైన మంత్రులు వర్షపాతం తక్కువుంటే మా మీద బదనాం పెడుతున్నరని మాట్లాడుతున్నరు. అది శుద్ధ తప్పు. దాదాపు 20-25 జిల్లాల్లో ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సాధారణ వర్షపాతం కన్నా అధికంగా వర్షం కురిసింది. కేవలం ప్రభుత్వ అసమర్థత, ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ పరిస్థితి వచ్చింది.

### రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

కాలం కాకపోతే రైతు ఇంత నష్టపోడు. దేవున్నో, ధర్మాన్నో తిట్టుకుంటడు. పంట వెయ్యడు. కానీ ఇక్కడ పంట వేసి, పెట్టుబడి పెట్టి, రోదిస్తున్నరు. రూ.25 వేలు పెట్టినమని కొందరు, రూ.22వేలు పెట్టినమని కొందరు.. ఇలా పెట్టిన పెట్టుబడి మొత్తం గంగపాలు అయ్యిందని మొత్తుకుంటున్నరు. వంద రోజుల్లో 200 పైచిలుకు రైతులు చనిపోయారని నేను మొన్న చెప్తే.. వివరాలు ఇవ్వండి 48 గంటల్లోగా పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మేం నాలుగు గంటల్లోనే 209 మంది రైతుల జాబితాను ప్రభుత్వానికి, ప్రధాన కార్యదర్శికి పంపినం. దాని తర్వాత ఇంకో ఐదు, పది దుర్ఘటనలు జరిగినయి. అయినా ఇప్పటికీ ఉలుకు పలుకు లేదు. ప్రభుత్వ అసమర్థత వల్లే చనిపోయారు కాబట్టి తలా రూ.25 లక్షలు చొప్పున ఆ కుటుంబాలకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలి. ఆ కుటుంబాలను పరామర్శించాలి. లేకుంటే ఆ ఉసురు, పాపం తగులుతది. పంట కోసంవేసిన పెట్టుబడిపోయింది. వస్తదనుకున్న పంటపోయింది. దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటామంటున్నారు. వద్దని నేను వాళ్లకు దండంపెట్టి చెప్పిన.

> పంటలు ఎండిన మాట వాస్తవం. నష్టం జరిగిన మాట వాస్తవం. రైతాంగం ఈ రోజు కన్నీరు మున్నీరవుతున్న విషయం వాస్తవం. 15- 16 లక్షల ఎకరాలంటే చిన్న విషయం కాదు. ఇది ప్రకృతి విపత్తు కంటే పెద్దది. ఈ సందర్భంగా రైతులను ప్రభుత్వం కాకపోతే ఎవరు ఆదుకోవాలే? ఎకరానికి రూ.25వేలు పరిహారం ఇవ్వాలి. తప్పించుకుంటామనుకుంటే ప్రజలు మీ వీపును విమానం మోత మోగిస్తరు. మిమ్మల్ని మాత్రం వదిలిపెట్టరు. మీ డ్రామాలు నడవవు. -కేసీఆర్

### ముఖ్యమంత్రివి నువ్వా.. నేనా?

సాగర్‌లో ఇప్పటికి డెడ్ స్టోరేజీ మీద 14 టీఎంసీల నీళ్లున్నయి. డెడ్‌స్టోరేజీ కింద 7 టీఎంసీలు, డెడ్‌స్టోరేజీ మీద 7 టీఎంసీల నీళ్లున్నయి. కేఆర్ఎంబీ వాడు మనకు బాస్‌లాంటోడా? వాడు కేవలం రెండు రాష్ట్రాల మధ్య సమన్వయ కర్త. వానికి మనమీద పెత్తనమెట్లుంటది.? తమాషా ఏదంటే.. నేను సూర్యాపేట జిల్లాకు పోతే నీళ్లు వదిలినరు. నా బస్సు వాపస్‌రాంగనే నీళ్లు వాపస్ పోయినయని ఫోన్లు వచ్చాయి. ఎన్నో రోజుల నుంచి ఎండబెట్టి.. నేను చెప్తే నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ నుంచి నీళ్లు వదిలినరు. నేను కరీంనగర్ వస్తుంటే.. మొత్తం కూలిపోయిందని చెప్పిన కాళేశ్వరం పంపులు ఆన్ చేసి వరదకాల్వల్లోకి నీళ్లు వదిలినరు. పైగా.. నీళ్లు వదలాలని కేసీఆర్ మాకు ముందే చెప్పాలె కదా అని సిగ్గులేకుండా ముఖ్యమంత్రి మాట్లాడుతుంటడు. మరి ముఖ్యమంత్రివి నువ్వా.. నేనా? నీ ఇంజినీర్లు ఏం చేస్తున్నరు? ఇరిగేషన్ మినిస్టర్ ఏం చేస్తున్నడు? డిపార్ట్‌మెంట్ ఏం చేస్తున్నది, నువ్వేం చేస్తున్నవు? సమయానికి నీళ్లు వదలక, ఉన్న వనరులను సమయానికి వాడుకోక, క్వాలిటీ కరెంట్ ఇవ్వక, సమయానికి రైతుబంధు ఇవ్వక, వెర్రి తిర్రి మాటలతో ప్రజలను కన్‌ఫ్యూజ్ చేశారు.

### కేసీఆర్ ఇగ ఆగడు..

నేను నాలుగు నెలల వరకు నోరు తెరువలే. వాళ్లు ఎన్ని పిచ్చిపిచ్చి ఆరోపణలు చేసినా.. ఎన్ని పీఆర్ స్టంట్లు చేసినా.. వాళ్లకు తొత్తులుగా ఉన్న మీడియాలో అడ్డగోలు వార్తలు రాయించి ఏం చెప్పినా మేం మాట్లాడలే. కొత్త ప్రభుత్వం వచ్చింది.. టైమియ్యాలె అని నేను మాట్లాడలే. మంచిచెడ్డలు ప్రజలకు తెల్వాలని ఓపికపట్టినం. మేమేదో ఓర్వలేక అంటున్నమని అంటరని ఓపిక పట్టినం. ఇప్పుడు కేసీఆర్ ఎళ్లిండు.. ఇక ఆగడు. ఒక జిల్లా, రెండు జిల్లాలు కాదు ఎక్కడ రైతులకు కష్ట మొస్తే అక్కడ గద్దలెక్క వాలుతా. మీ సంగతి తేలేదాకా వందకు వంద శాతం పోరాటం చేస్తం. ఈ పోరాటం ఒక రోజుతో, ఒక పూటతో అయ్యేది కాదు. సమస్యలు పరిష్కారమయ్యే దాకా ప్రజల పక్షాన ఉండడమే మా బాధ్యత. మేం ఈ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం. వంద శాతం మాకు ప్రజలు అదే పాత్ర ఇచ్చినరు. కాబట్టి ఆ పాత్రకు మేము పూర్తి న్యాయం చేస్తం. మీ మెడలు వంచుతం, ప్రజలకు న్యాయం చేస్తం.

### బీజేపీ.. ఒక పార్టీనా?

బీజేపీ.. ఒక పార్టీయేనా అసలు?. గతంలో వంద నియోజకవర్గాల్లో డిపాజిట్ కోల్పోయింది. మొన్న అసెంబ్లీ ఎలక్షన్లలో 64 సీట్లలో డిపాజిట్ పోయింది. ఇప్పుడు క్యాండేట్ కావలెను.. క్యాండేట్ కావలెను.. అనుకుంట మా నాయకులు, కార్యకర్తల చుట్టూ తిరుగుతున్నరు' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు.



సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో తీవ్ర ఆగ్రహంతో మాట్లాడుతున్న కేసీఆర్

> మొన్న సూర్యాపేట నుంచి నేను బయలుదేరిన. ఇప్పటి వరకు మూడు కాల్వలకు నీళ్లొదిలినరు. ఈ తెలివి ముందెటుపోయింది? ఎందుకు నీళ్లు వదలలేదు, ఎందుకు వేల ఎకరాల పంటలు ఎండగొట్టిండ్రు? 20 -25 రోజులు ముందు నాగార్జునసాగర్ నుంచి నీళ్లు వదిలి ఉంటే వేల ఎకరాల్లో ఒక తడి కోసం వేచిచూసిన పంట ఎండిపోకపోయేది. వరదకాల్వ కింద 20 -25 రోజుల కింద నీళ్లు వదిలి ఉంటే గ్రామాల్లో కొన్ని వందల ఎకరాల పంట బతికేది. -కేసీఆర్

---

### నేడు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ రైతు దీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో శనివారం బీఆర్ఎస్ రైతుదీక్షలు చేపట్టనున్నది. ఉదయం 11 గంటల నుంచి ఇవి ప్రారంభమవుతాయి. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ శ్రేణులు ఈ దీక్షల్లో పాల్గొంటారు. ''అసెంబ్లీ ఎన్నికల్లో రైతుభరోసా పేరిట కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్కహామీని నిలబెట్టుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 4 నెలలు అవుతున్నా హామీలను అమలు చేయకపోగా, రైతులను ఇష్టారీతిగా అవమానాలకు గురిచేస్తున్నది. రైతుబంధు విడుదలలో జాప్యం, కరెంట్‌కోతలు, ధాన్యానికి రూ. 500 బోనస్ హామీ ఇచ్చి నిలబెట్టుకోకపోవటమే కాకుండా కాంగ్రెస్ అనాలోచిత చర్యలతో 209 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు'' అని బీఆర్ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అన్ని జిల్లాల్లో రైతు దీక్షలు చేయనున్నది. సిరిసిల్లలో కేటీఆర్, సంగారెడ్డిలో హరీశ్‌రావు, సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి, పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు సహా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రైతుదీక్షలు చేపట్టనున్నారు.

# ఇందిరమ్మ రాజ్యం.. ఇకిలించినట్టే!

మొదటిపేజీ తరువాయి...

ప్రజాసమస్యలను పరిష్కరించేదాకా ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు. 'కొత్త ప్రభుత్వానికి టైమియ్యాలె అని నేను మాట్లాడలే. మంచిచెడ్డలు ప్రజలకు తెల్వాలని ఓపిక పట్టినం. ఇప్పుడు కేసీఆర్ బయటికి ఎళ్లిండు.. ఇక ఆగడు. రైతులకు కష్టమొస్తే అక్కడ గద్దలెక్క వాలుతా. ఈ పోరాటం ఒకరోజుతో, ఒక పూటతో అయ్యేది కాదు. సమస్యలు పరిష్కారమయ్యేదాకా ప్రజల పక్షాన ఉండటమే మా బాధ్యత. మేం ఈ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం. వందశాతం మాకు ప్రజలు అదే పాత్ర ఇచ్చినరు. కాబట్టి ఆ పాత్రకు మేము పూర్తి న్యాయం చేస్తం' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

### సంక్షోభంలో వ్యవసాయం

తాము పదేండ్లు కష్టపడి అనేక పథకాలు పెట్టి, వ్యవసాయరంగాన్ని బాగు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు రాక, సాగునీరు ఇవ్వక, నాణ్యమైన కరెంటు లేక, మోటర్లు కాలిపోయి వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాళ్లవానకు లక్షన్నర ఎకరాల్లో రైతులు పంట నష్టపోగా, ప్రభుత్వ అసమర్థ నీటి నిర్వహణ విధానం వల్ల సుమారు 15-20 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని చెప్పారు. 'ఇది కాలం తెచ్చిన కరువా.. మనుషులు తెచ్చిన కరువా.. కాంగ్రెస్ తెచ్చిన కరువా?. ఈ కరువుకు కారణం ఎవరు? ఎవరి అసమర్థత.. ఎవరి తెలివి తక్కువతనం. ఇది ప్రకృతి వైపరీత్యం కన్నా పెద్ద నష్టం' అని మండిపడ్డారు. ఎండిన ప్రతి ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వందరోజుల్లో 200 మందికి పైగా రైతులు చనిపోయారని తాము చెప్తే.. వివరాలు పంపితే 48 గంటల్లోగా పరిహారం ఇస్తామని సీఎం అన్నారని గుర్తు చేశారు. తాము నాలుగు గంటల్లోనే 209 మంది రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపితే ఇప్పటివరకు ఉలుకూ పలుకూ లేదు. వెంటనే తలా రూ.25 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారని, ఇప్పుడు బ్యాంకులు రైతులకు నోటీసులు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే బ్యాంకర్లతో చర్చలు జరిపి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. ప్రతి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి కొంటామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీ బోగస్ అయ్యిందని విమర్శించారు. 'అన్ని పంటలు కొనకుంటే పులుల్లాగా మీ గొంతు కరిచి చంపుతరు జాగ్రత్త' అని కేసీఆర్ హెచ్చరించారు.

> కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలు, చేతగానితనంతో నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగం పట్టించారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే 2014కు ముందు తెలంగాణ పడిన గోస ఇప్పుడు పునరావృతం అయింది. - కేసీఆర్

### నేనే మోటర్లు నడిపిస్తా..

కాళేశ్వరం కుంగిందని కేసీఆర్‌ను బదనాం చేయాలనే ఏకైక లక్ష్యంతో గోదావరిలో దాదాపు 48 టీఎంసీల నీటిని సముద్రంలోకి వదిలి పెట్టారని, ఇప్పుడు కూడా 1,500 క్యూసెక్కుల నీరు పోతున్నదని కేసీఆర్ చెప్పారు. ప్రభుత్వానికి తెలివి ఉంటే వాటిని ఎత్తిపోసేదని తెలిపారు. గోదావరిలో ప్రవాహం ప్రారంభమయ్యాక మేడిగడ్డ బరాజ్‌తో సంబంధం లేకుండానే నీళ్లను ఎత్తిపోయవచ్చని తెలిపారు. ఇప్పటికైనా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, నీళ్లు ఎత్తకుండా ప్రజల నోట్లో మట్టి కొడుతమంటే చూస్తూ కూర్చోబోమని స్పష్టం చేశారు. 'గోదావరిలో వరద 20 వేల క్యూసెక్కులు దాటిన తర్వాత కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా నీళ్లు ఎత్తడం ప్రారంభించకపోతే, నేనే 50 వేల మంది రైతులను వేసుకొని పోయి, అడ్డొచ్చిన వాళ్లను పండబెట్టి తొక్కి మోటర్లను నడిపిస్తా. రాష్ట్రం రణరంగమైనా మంచిదే' అని కేసీఆర్ హెచ్చరించారు.

### చేనేత కార్మికులు పులిబిడ్డలై గర్జిస్తరు

చేనేత కార్మికులను ఆదుకోవడంతోపాటు, ఆత్మహత్యలను నివారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ పండుగల పేర్లతో వస్త్రాలకు ఆర్డర్ ఇచ్చిందని కేసీఆర్ చెప్పారు. ప్రభుత్వం వారికి రూ.300 కోట్ల బకాయిలు చెల్లించడం లేదని, కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. 'అడిగితే చేనేత కార్మికులు దొబ్బితిన్నరు అంటరు. ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తే కష్టం చేసిన్రు. నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకొని బతకమంటరా? వాళ్లు మనుషుల్లా కనబడతలేరా? లక్షలాది చేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతీస్తరా?' అని కాంగ్రెస్ తీరును దుయ్యబట్టారు. కార్మికులు చేస్తున్న ధర్నాలో తాము కూడా పాల్గొంటామని, మూడు నాలుగు రోజుల్లో ఆర్డర్లు, బకాయిలు రాకుంటే బజారుకీడ్చుతామని, చేనేత కార్మికులు పులిబిడ్డలై గర్జిస్తారని హెచ్చరించారు.

### ముఖ్యమంత్రివి నువ్వా.. నేనా?

తాను జిల్లాల పర్యటన మొదలుపెట్టిన తర్వాత మూడు కాల్వలకు నీళ్లు వదిలారని కేసీఆర్ పేర్కొన్నారు. కూలిపోయిందని ప్రచారం చేసిన కాళేశ్వరం పంపులు ఆన్‌చేసి మరీ వరద కాల్వల్లోకి నీళ్లు వదిలారని చెప్పారు. అడిగితే.. 'నీళ్లు వదలాలని కేసీఆర్ మాకు ముందే చెప్పాలె కదా' అని సీఎం సిగ్గు లేకుండా మాట్లాడారని ఎండగట్టారు. 'ముఖ్యమంత్రివి నువ్వా.. నేనా? నీ ఇంజినీర్లు, ఇరిగేషన్ మినిస్టర్ ఏం చేస్తున్నరు' అని ప్రశ్నించారు. సాగర్ ఎడమకాలువలోకి, వరద కాలువలోకి 20-25 రోజుల ముందే నీళ్లు వదిలి ఉంటే వేలాది ఎకరాల్లో పంట దక్కేదని చెప్పారు.

> ఇప్పుడు కేసీఆర్ బయటికి ఎళ్లిండు.. ఇక ఆగడు. రైతులకు కష్టమొస్తే అక్కడ గద్దలెక్క వాలుతా. ఈ పోరాటం ఒకరోజుతో, ఒక పూటతో అయ్యేది కాదు. సమస్యలు పరిష్కారమయ్యేదాకా ప్రజల పక్షాన ఉండటమే మా బాధ్యత. - కేసీఆర్

> 'గోదావరిలో వరద 20 వేల క్యూసెక్కులు దాటిన తర్వాత కన్నెపల్లి పంపుహౌస్ ద్వారా నీళ్లు ఎత్తడం ప్రారంభించాలి. లేకుంటే నేనే 50 వేల మంది రైతులతో వెళ్లి అడ్డొచ్చిన వాళ్లను పండబెట్టి తొక్కి మోటర్లను నడిపిస్తా. - కేసీఆర్

### తులం బంగారం దొరకలేదా?

వృద్ధాప్య పింఛన్లు రూ.4 వేల చొప్పున ఇంటికి ఇద్దరికి వేస్తామని హామీ ఇచ్చారని కేసీఆర్ తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షల వృద్ధాప్య పింఛన్లు ఉన్నాయని, డబుల్ ఇచ్చేది కలుపుకుంటే ఒక్కో కుటుంబానికి రూ.24 వేలు ఇవ్వాల్సి ఉన్నదని చెప్పారు. ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం కింద ఇవ్వడానికి తులం బంగారం దొరకలేదా? అని ప్రశ్నించారు. దళితబంధు, గొర్రెల పంపిణీ వంటి పథకాలకు నిధులు నిలిపేశారని, చివరికి పేద పిల్లల బ్రేక్‌ఫాస్ట్‌ను కూడా ఆపేశారని మండిపడ్డారు.

### 'లత్కోర్ వాగ్దానాలతో 1.8 శాతం ఓట్లే ఎక్కువొచ్చినయ్

బీఆర్ఎస్‌కు 37 శాతం ఓట్లు వచ్చాయని, కాంగ్రెస్‌కు 38.8 శాతం ఓట్లు వచ్చాయని కేసీఆర్ గుర్తు చేశారు. 'లత్కోర్ వాగ్దానాల వల్ల జస్ట్ 1.8 శాతం ఓట్లు ఎక్కువ వచ్చినయ్. తులం బంగారానికి కొందరు మోసపోయింఢ్రు. రూ.10 లక్షల బదులు రూ.12 లక్షల దళితబంధు వస్తదని ఇంకొందరు మోసపోయింఢ్రు. రూ.2 వేల బదులు రూ.4 వేల పింఛన్ వస్తదని మరికొందరు మోసపోయింఢ్రు. రూ.2 లక్షల రుణమాఫీకి కొందరు మోసపోయింఢ్రు. రూ.500 బోనస్ ఇస్తరని, లేడీస్‌కు స్కూటీలు ఇస్తరని ఇంకొంతమంది మోసపోయినరు' అని వివరించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు, రైతులకు, చేనేతలకు, యాదవులకు, పింఛన్‌దారులకు, దళితులకు, రుణమాఫీకి, బోనస్‌కు ఇలా అన్నింటికీ శఠగోపం పెట్టిందని మండిపడ్డారు. 'బిడ్డా.. వాళ్లే మీకు కర్రు కాల్చి వాతపెడతరు. మీ కథ ఏందో, రామాయణమేందో చూపిస్తరు' అని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.